
# సినీ బేతాళ కథలు

## – డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

### - *28* -

### - *ఉత్తరస్త్రీ గ్రహణం* -

**విసుగు చెందని** విక్రమార్కుడు మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు. 'విక్రమార్కా! దారిలో నీకు శ్రమ కలుగకుండా వుండేందుకు మరో కథ చెబుతాను విను!' - అని బేతాళుడు ప్రారంభించాడు.

"ఆ మధ్య యెప్పుడో ఆరుద్రగారిని - అయ్యా! మీరు తెలుగు సాహిత్యాన్ని, తెలుగు సినిమా మాట పాటల్నీ స్కాచి వడబోసిన వుద్దండులు కదా! మరి మీరీ మధ్యన రాసిన సినిమాకి 'తోటలో పిల్ల, కోటలో రాణి' అని పేరెందుకు పెట్టారు? - అని అడిగితే పన్నులలో సంపన్నుడైన, పంచ్‌ల విపంచీ విరించి ఆరుద్ర అరక్షణం కూడా తడువుకోకుండా - 'తోటలో పిల్ల, కోటలో రాణి' అంటే నా వుద్దేశం - 'తనకి తోచదు ఒకడు చెబితే వినడు' అని నిర్మాతను చమత్కరించారు.

నిర్మాతలెప్పుడూ అందరికీ లోకువే. సినిమా ఆడితే దర్శకుడి ప్రతిభ, ఆడకపోతే ఆడుత్తెదవ - ఆడంటే నిర్మాత. ఆర్టిస్టుకి పేరొస్తే అభిమానుల చలవ, రాకపోతే 'నిర్మాత డబ్బులెగ్గొట్టి మూడాఫు చేశాడు. సరిగా చైడం కుదర్లా' - యిలావున్నా సినీ కళామ తల్లి, చిత్రపుత్రికల కంటే నిర్మాత పుత్రుల్నే యెక్కువ కంటుంది. చాలా సినిమాలు మధ్యలోనే ఆగిపోతాయిగా మరి.. అందుకని. ఇప్పుడు మన నిర్మాత దారుణపులిగారు యీసారి దారుణంగా రుణాలు చేసి తన కొత్త చిత్రం తలపెట్టాడు. తన దర్శకుడు డిజిటల్ బుజ్జిని పిలిచి, 'ఏవోయ్ బుజ్జీ కథ రెడీ అయిందా?' అని అడిగాడు - ఏదో కాల విరోచనం అయిందా - అని అడిగినట్టు. 'కథ సాఫీగా అయింది పులిరాజా!' - అన్నాడు డిజిటల్ బుజ్జి.

'ఏవిటిసయం ఈసారి?' అడిగాడు పులి.

'ఏటుంటదండి? యీ మద్దొచ్చే అన్ని కథల్లాగే రొటీన్ కథ. ఓ కిట్టాజిల్లా హీరో. రాయలసీమ రక్తాలు కురిపించే విలను. తెలంగాణా కామెడీ విలను. ఓ కైపుల పిల్ల అవిటం సాంగు' చెప్పాడు బుజ్జి.

'మరి రొటీన్ కథ కొత్తగా యెల్లా సేస్తావ్?' - పులి

'మీరే సూత్తారుగా, గ్రాపిక్కులు యిరగదీస్తా' - బుజ్జి.

'ఈరోయిన్? - పులి

'ఈరోయిన్‌కి గంతులు తప్ప, యెమోసన్లుండవండి. అందరిలాగే ఓ ముంబాయి పిల్లనెట్టుకుందాం'

'అయితే డబ్బుకోసం యెనకాడకు. మాంచి కంజాయింపు శాల్తీని సూడు. నాకైతే దీపికా పడుకొనే కరెస్టేమో అనిపిత్తాంది.'

'దీపికా పడుకునే ఆలీవుడ్లో అడావుడిగా వుందండి. అయితే 'అమితా నిలబడే' అనే కొత్తగుంట వూపేత్తోందండి.'

'అమితా నిలబడేనా?'

'మరేనండి. కానీ అంతా ఆ పిల్లని అంతా నిలబడే అని పిలుత్తారండి. బాగా బిజీ అండి. కూర్చోదు. పడుకోదు. అన్నీ అంతా నిలబడే, అంతా నిలబడే చాస్తందండి.'

'అయితే మరీ సుకం. నీకూ, నాకూ మోకాళ్ళ నొప్పులుకదా! యింకెందుకు ఆలీసం - బుక్ సేసెయ్యి.'

'పులిగారూ! ఆ పిల్ల సేతులో ప్యాసరు కోసం కట్టపడి కసింత తెలుక్క్యాడా నేరుసుకుందండి.'

'అదేంపర్లా బుజ్జీ! తెలుగు బాగా వచ్చిన తెలుగోళ్లకే డబ్బింగెట్టేత్తన్నాం. ముందు పిలిపించు. ఓ మారు సూద్దారి.' అని ఆదేశించాడు నిర్మాత దారుణ పులి. దర్శకుడు డిజిటల్ పులి యాక్షన్‌లోకి దిగాడు.

బాలీవుడ్ హీరోయిన్, 'అంతా నిలబడే'ని దర్శక బుజ్జి నిర్మాత పులి దగ్గరకు తీసుకొచ్చాడు.

'నీ పేరోసారి సెప్పమ్మా!' - అడిగాడు పులి.

'అమీతా నిల్‌బడే' బట్ అంద్రూ 'అంథా నిల్‌బడే' అంద్రు!

'ఏ పిచ్చరు యాక్టా?'

'అంథే మే బందర్' - వెరీ బిగ్ బిగ్ హిట్.'

'దాని ముందేం జేసావ్! భిఫోర్ వాట్టూ?'

'ఆయ్! మరేనండి - ఆఫిటర్ దట్ - 'పేడ్ కే నీచే దౌడ్ కే నాచే - చేసా హై'

'అయ్‌బాబో - గోదారి తెలుగు!'

'అవ్వును పులిగాడూ! తెల్గూ ఖూబ్ నేర్సుఖన్నా.'

'వేరూ? ఎక్కడా హై?'

'ఆయ్! మరేనండి. వెస్ట్ గొడారీ తన్నుఖూమే'

'తణుకా? తణుకులో వేరెక్కడా?'

'ఆయ్! మరేనండి. నానయాభట్ ఆర్కో పీటం మే -'

'నన్నయ భట్టారక పీఠం అని యీవిడుద్దేసం' - క్లారిటీ యిచ్చాడు డిజిటల్ బుజ్జి.

'నాకర్దవయిందిలే బుజ్జీ! నన్నయగారు బతికుంటే దీని తెలుగు విని తణుకులో గోస్తనదిలో మునిగి అరీమంటాడు.-'

'మన కరెంటు తెలుగు సినిమాలు చూద్దావని బతికొచ్చిన నన్నయ, తిక్కన, ఎర్రాప్రెగ్గడ, పోతన మొదలైన మహాకవులంతా ఆల్ రెడీ ఆత్మహత్యలు సేసేసుకున్నారు పులిగారూ! మళ్లీ సచ్చినా పుట్టరు' అని హామీ యిచ్చాడు డిజిటల్ బుజ్జి. 'అంతేకాదు. తెలుగు రాష్ట్రంలో తెలుగు విద్యాబోధన విదేశ వ్యామోహానికి బలై తెగులు పట్టిపోయింది. ఆ తెలుగే ప్రేక్షకులకు యిష్టమై, నిర్మాతలకు నిత్య సంకెలయిపోయింది. పాపం! మన తెలుగు సినిమా అమ్మ మాత్రం ఏం చెయ్యగలదు?' - అని కూడా అన్నాడు దర్శక బుజ్జి.

'సర్లే - దీని 'సేపు' ఒకే. బుకింగు సేసీయ్ మరి.'

'ఓకే - పులిగారూ! ఓకే. ఆల్ ఫిక్సుడు. '

'అమ్మా! అంతా నిలబడే! నువ్వే మా పిచ్చరు హీరోయిన్'

'ఆయ్! మరేనండి! సమజ్ మే ఆయా!'

అంతా నిలబడేతో నిర్మాత దారుణ పులిగారి చిత్ర నిర్మాణం పూర్తిచేశాడు దర్శకుడు డిజిటల్ బుజ్జి. అయితే ప్యాచ్ వర్క్ కాస్త మిగిలింది.

'అమ్మా! అంతా నిలబడే! ప్యాచ్ వర్క్ పూర్తి చేద్దామా?' అడిగాడు బుజ్జి.

'ఆయ్ - మరేనండి. సేద్దారండి. మరేవో పులిగారు యింకో కోటిరూపాయిలివ్వాలండి. అదిప్పించేస్తే - యింక తేడాలుండవండి.'

'అయ్యాక - యిచ్చేస్తారులే -' బుజ్జి.

'కుదర్దండి. ఆర్టిస్టోళ్లం అంతా పాచిపని అదే లెండి ప్యాచ్ వరకు ముందే సెటిలింగులు సేసేసుకుంటావండి'

'ఎందుకో అలా?'

'ఎందుకేటండి! పాచ్‌వరకు తరాత సినిమా ప్లాపయితే మన పులి పొడ్డూసరు, ముళ్లపూడోరు సెప్పినట్టు జరం తగిలిన పులైపోయి, గోచీ యెట్టుకుని యే కాకరపర్రో, కంకిపాడో డేకేసి కనుమరుగైపోతారండి - ఆయ్! మరేనండి - అదీ యిసయం' - అంది అంతా నిలబడే

అంతా విన్న నిర్మాత పులి దారుణంగా షేకయిపోయి, 'అద్సరేగానీ, తెలుగు దంచేత్తన్నావిప్పుడు - ముంబయిలో తెలుగోళ్ల మద్యుండేదానివా?'

'ఆయ్ - మరేనండి - కానీ ముంబయిలో కాదండి. మా వూరు తణుకేనండి. నేను తెలుగమ్మాయినండి. తెలుగమ్మాయయితే మాకు మన తెలుగు సినిమాల్లో ఈరోయిన్ చాన్సులియ్యరు కదండీ - మరి ఆ హిందీ సినిమాలు సైడం మాత్తరం నిజమేనండి. మనెదవలకంటే బాలీవుడ్లోళ్లే నయం - సౌతాళ్లని బాగా యెట్టుకుంటారు' అని ముగించింది అమితా నిలబడే అనే అంతా నిలబడే అనే అజ్జరం అమిత.

వెంటనే నిర్మాత దారుణపులి, దర్శకుడు డిజిటల్ బుజ్జి కళ్లమ్మట నీళ్లు పెట్టుకుని అర్జంటుగా అజ్జరం అమితకు బాలన్స్ కోటిరూపాయలు యిచ్చేసి, సినిమా పూర్తి చేశారు. సినిమా సక్సెస్ అయి విజయ ఢంకా మోగించింది. వెంటనే తమ తదుపరి చిత్రం ఎనౌన్సు చేశారు.

- అదీ విక్రమార్కా! అంతా పడుకునే అనే అజ్జరం అమిత కథ. ఇప్పుడు చెప్పు! 'వారి తదుపరి చిత్రంలో హీరోయిన్‌గా మళ్లీ ఆమెనే బుక్ చేసారా? తెలుగు యంగ్ లేడీ టాలెంట్‌కి ప్రోత్సాహమిస్తూ తెలుగు నిర్మాతల వైఖరిలో మార్పు తేగలిగారా?' - ఈ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో, నీ తల బట్టతలై విగ్గుపెట్టుకుని విషాద మూడ్‌లో నువ్వు పెగ్గు పట్టుకోవాల్సొస్తుంది -" అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు - "ఓ! బేతాళా! నిర్మాత దారుణపులి, దర్శకుడు డిజిటల్ బుజ్జి తమ తదుపరి చిత్రంలో అజ్జరం అమిత అంటే అంతా నిలబడేని హీరోయిన్‌గా బుక్ చెలేదు. తెలుగు భాష మీద గౌరవంతో ఆమెను తమ సొంత ఖర్చులతో ఒక గొప్ప తెలుగు పండితుడి శిష్యురాలిగా చేర్చారు. తమ తర్వాత సినిమాకి అసమాన నటి అపురూప సౌందర్యవతి అయ్యి అమండా సెఫ్రెడ్ అనే హాలీవుడ్ నటిని యెంచుకున్నారు. తెలుగు వచ్చినా రాకపోయినా ఎవరికేనా డబ్బింగే కదా! అయినా కళాకారులకు టాలీవుడ్డా, బాలీవుడ్డా,

కోలీవుడ్డా, హాలీవుడ్డా ప్రధానంకాదు. వారు స్టార్స్ కావాలంటే సామర్ధ్యం కావాలి. ఆ సామర్ధ్యం వారికి అసమానమైన కాంతి యిస్తుంది - వెయ్యిమంది సూర్యులు ఒకేసారి వుదయించినట్టు.

- దివి సూర్య సహస్రస్య
భవే ద్యుగపదుత్థితా!
యది భాస్సదృశీసాస్యాత్
భాస స్తస్య మహాత్మనః || - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు" -

- అని చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు యెగిరి మళ్లీ సినిమాలా విశాలంగా విస్తరించిన చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments